క్లుప్తంగా

రైతు బజార్లలో కూరగాయల ధరలు

సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరల వివరాలు..

దిల్‌సుఖ్‌నగర్: టమోటా రూ.13, (618 రకం) వంకాయ 23, బెండ 55, పచ్చిమిర్చి 35, కాకరకాయ 35, బీరకాయ 45, కాలిఫ్లవర్ 23, క్యాబేజీ 09, క్యారెట్ 21, దొండ 35, ఆలుగడ్డ 21, ఉల్లి 17, గోకర 35, దోస 23, సొరకాయ 11, పొట్లకాయ 18, అరటికాయ 09, చిక్కుడు 50, అర్వి 68, చిలుకడ దుంప 25, బీట్‌రూట్ 15, కీర 18, బీన్స్ రూ.37, క్యాప్సికమ్ రూ.45. ఈ ధరలు ఆదివారం ఉదయం 9 గంటల వరకు అమలులో ఉంటాయి.

11న మెగా జాబ్‌మేళా

చాదర్‌ఘాట్: ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 11న సరూర్‌నగర్ స్టేడియంలో నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ వాసుదేవరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 108 కంపెనీలు పాల్గొనే మేళాలో పది వేలకు పైగా ఉద్యోగాలు ఇవ్వబోతున్నట్లు పేర్కొన్నారు. కనీస అర్హత 7వ తరగతి ఉండాలని మరిన్ని వివరాలకు 7286008234, 9505437112, 8247768371 నంబర్లలో సంప్రదించాలన్నారు.

కమీషన్ల కోసమే రాంకీ సంస్థకు పారిశుద్ధ్య పనులు

నాగోలు: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పూర్తిగా కమీషన్ల కోసం రాంకీ సంస్థకు పారిశుద్ధ్య పనులు అప్పగించారని బీజేపీ రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షుడు సామ రంగారెడ్డి అన్నారు. కొత్తపేట డివిజన్ మోహన్‌నగర్‌లోని జనప్రియ అపార్ట్‌మెంట్స్ వద్ద కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో స్వచ్ఛ్ ఎల్బీనగర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించి చెత్తను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీలో క్షేత్రస్థాయిలో మున్సిపల్ కార్మికులను పెంచకుండా కంపెనీలకు పనులు అప్పజెప్పడంతో కాలనీల్లో చెత్త అక్కడే పేరుకుపోయి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అశ్విన్‌సింగ్, జంగారెడ్డి, గీతారెడ్డి, సుందర్ నారాయణ, రాజేష్, రమేష్‌చారి, ఉపేందర్ సింగ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సహారాస్టేట్స్‌కాలనీలోని లలితా నాగలింగేశ్వరస్వామి దేవాలయం



ఆలయ ప్రాంగణంలో శిథిలావస్థలో ఉన్న మెట్లబావి

శంభో.. శివశంభో..

- భక్తుల కోర్కెలు తీర్చే శ్రీలలితా నాగలింగేశ్వర స్వామి
- 400 ఏళ్ల చరిత్ర కలిగిన ఆలయం

మన్సూరాబాద్: సహారా స్టేట్స్ కాలనీలోని శ్రీలలితా నాగలింగేశ్వర స్వామి దేవాలయం భక్తుల కోర్కెలను తీర్చే కొంగు బంగారంగా పేరుపొందింది. 400 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన దేవాలయం. పూర్వం ఈ ప్రదేశం అటవీ ప్రాంతం కావడంతో దేవాలయం ఉన్న సంగతి తెలియలేదు. ద్రాక్ష తోటల మధ్య దిగుడుబావి నీటిలో స్వయంభుగా వెలిశాడు కనుక గంగను తన వెంటే పెట్టుకుని వెలిశాడని భక్తుల విశ్వాసం. సహారా స్టేట్స్ సంస్థ ఈ స్థలాన్ని కొనుగోలు చేసి గేటెడ్ కమ్యూనిటీని ఏర్పాటు చేయడంతో దేవాలయం విశిష్టత తెలిసింది. అప్పటి నుంచి దేవాలయంలో నిత్యం పూజలు జరుగుతున్నాయి. మహాశివరాత్రి, ఏకదశి మొదలుకొని అన్ని పండగ సమయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు చేపడుతున్నారు. పర్వదినాల్లో భక్తులు శివదర్శనం కోసం పెద్దఎత్తున వస్తుంటారు. శివరాత్రి సందర్భంగా పెద్దఎత్తున ప్రజలు వస్తారని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్రాచీన దేవాలయం



కాలనీలోని లలితా నాగలింగేశ్వరస్వామి దేవాలయం అతి ప్రాచీనమైంది. భక్తుల కోర్కెలు తీర్చే ఇలవేల్పు. మహాశివరాత్రి, ఏకాదశి, గణపతి, దుర్గా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నాం. ఇందుకు భక్తులు తమ వంతు సహకారం అందజేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సహకారంతో శివరాత్రికి ఏర్పాట్లు చేస్తున్నాం. నిత్యం ప్రత్యేక పూజలు చేపడుతున్నాం.

– రాపోలు విశ్వనాథం, ఆలయ కమిటీ అధ్యక్షుడు

మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి



వివిధ కంపెనీల ప్రతినిధులతో ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్: సరూర్‌నగర్ స్టేడియంలో ఈనెల 11న నిర్వహించే మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కోరారు. శనివారం ఆయన తన కార్యాలయంలో నూతనంగా హాజరైన కంపెనీల ప్రతినిధులతో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ.. జాబ్‌మేళాలో మొదట 120(టెక్నికల్, నాన్‌టెక్నికల్, ఐటీ, నాన్‌ఐటీ) కంపెనీలతో ఏర్పాటు చేస్తున్నామని, జాబ్‌మేళా ప్రకటనలు చూసిన 32 ఇతర కంపెనీలు కూడా ముందుకు రావడం హర్షణీయమని అన్నారు. జాబ్‌మేళాలో 152 కంపెనీల్లో సుమారు 14 వేల మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నాయని స్పష్టం చేశారు.

ప్రభుత్వ స్థలాలు కబ్జా చేస్తే కేసులు పెట్టండి

చైతన్యపురి: ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే పోలీసులు కేసులు నమోదు చేసేలా చూడాలని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి జీహెచ్‌ఎంసీ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని పలు పార్కు స్థలాలు కబ్జాకు గురైనట్లు సమాచారం అందుకున్న ఎమ్మెల్యే శనివారం జీహెచ్‌ఎంసీ ఈస్ట్ జోనల్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. బీఎన్‌రెడ్డి నగర్, చంపాపేట, హస్తినాపురం, చైతన్యపురి, హయత్‌నగర్, మన్సూరాబాద్ డివిజన్లలోని టీచర్స్ కాలనీ, హైవే కాలనీ, జక్కిడి రాంరెడ్డి కాలనీ, ఎస్‌వీ కాలనీ, భవానీనగర్ కాలనీల్లో పార్కు స్థలాలు కబ్జాకు గురైనట్లు అధికారులకు తెలిపారు. కోర్టుల్లో గట్టిగా పోరాడాలని సూచించారు. మూడేళ్లలో దాదాపు 11 స్థలాలు జీహెచ్‌ఎంసీకి అప్పగించినట్లు చెప్పారు. జోనల్ కమిషన్ పంకజ, సిటీ ప్లానర్ ప్రసాద్, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్లు సురేందర్ రెడ్డి, మారుతి దివాకర్, కృష్ణయ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అల్కాపురిలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి, ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం సప్తదశ ఆలయ వార్షికోత్సవాలు శనివారం ఘనంగా జరిగాయి. ఉదయం ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామికి విశేష పంచామృతాభిషేకం, సమస్రనామర్చాన, రుద్రహోమం, మన్యుపాశుపత హోమం, భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి వారికి శివ సహస్రనామ పారాయణం సహిత సహస్రఘటాభిషేక పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 1000కి పైగా కలశ జలాలతో స్వామివారికి అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శృంగేరి శంకరమఠం బ్రాంచ్ హెడ్ శ్రీనివాస్, నిర్వాహకులు గౌరి శంకర్, విశ్వనాథ శోభనాద్రి, సూర్యనారాయణరావు, గౌరి భాస్కర్, ముదికొండ శంకరశర్మ, సూరి వ్యాస్‌కుమార్, నరసింహమూర్తి, సుధాకర్ వర్మ పాల్గొన్నారు. ఆలయ సప్తదశ ఆలయ వార్షికోత్సవాలు సందర్భంగా ఆదివారం ఉదయం 10 గంటలకు దేవాయలంలో శ్రీరమా సహిత సత్యనారాయణ స్వామివారి వ్రతం, అనంతరం కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

చక్రాల కుర్చీలు, ఔషధాల అందజేత



మెడిసిన్ అందజేస్తున్న హరికృష్ణ భూపతి

మలక్‌పేట: అంతర్జాతీయ కేన్సర్ దినోత్సవం సందర్భంగా రంగారెడ్డి జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మూసారంబాగ్‌లోని రంగారెడ్డి జిల్లా వృద్ధులు, వికలాంగుల మహిళ సదనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కేరింగ్ హ్యాండ్స్ ఎన్‌జీవో అబ్దుల్‌వసి సహకారంతో వీల్ చైర్స్, సీనియర్ సిటిజన్స్‌కు స్టిక్స్, బ్లైండ్ స్టిక్స్, వాకర్స్, పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. జిల్లా పారా లీగల్ వలంటీర్ శ్రీనివాస్ మెడిసిన్ అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ హరికృష్ణ మాట్లాడుతూ.. వృద్ధులు, వికలాంగులకు సహాయ సహకారాలు అందించడానికి సంస్థ ఎల్లప్పుడు ముందుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి ఆర్. తిరుపతి, కమర్షియల్ కోర్టు జడ్జి నర్సిరెడ్డి, 11వ, అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి జయప్రసాద్, ఏడవ అదనపు జిల్లా జడ్జి అఫ్రోజ్ అక్తర్ పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి



పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సబితా ఇంద్రారెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: నియోజకవర్గ సమగ్ర అభివృద్ధి, కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, పార్కు సుందరీకరణ కోసం నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ గ్రీన్ హిల్స్ కాలనీలో రూ.30 లక్షలతో చేపట్టిన పార్కు సుందరీకరణ పనులకు శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్నానని తెలిపారు. కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయిస్తుందని ఆర్కేపురం డివిజన్‌లోని ప్రతి కాలనీలో దశలవారీగా మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అభివృద్ధి పనులు జరిగేటప్పుడు కాలనీ వాసులు పర్యవేక్షిస్తూ నాణ్యత లోపించకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి, డీసీ కృష్ణయ్య, నాయకులు అరవింద్ శర్మ, నగేష్, ఊర్మిళ రెడ్డి, బీరెల్లి వెంకటరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కొంద్రు శ్రీనివాస్, మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

చెక్కుల అందజేత



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: శంకర్‌నగర్, పద్మనగర్, వాహేద్‌నగర్, హౌజింగ్‌బోర్డు కాలనీ, కాలడేరా కాలనీ, కమల్‌నగర్, మూసానగర్, ఆజంపుర, ఫర్హత్‌నగర్, చంచల్‌గూడ, ఉస్మాన్‌పుర, కట్టెలగూడ, షాహకాలనీ, ఛవుని ప్రాంతాలకు చెందిన 120 మందికి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను శనివారం పంజేషాహలోని కార్యాలయంలో ఎమ్మెల్యే అహ్మద్ బలాల అందజేశారు. ఈ కార్యక్రమంలో అంబర్‌పేట, చార్మినార్ మండలాల ఆర్‌ఐలు శ్రీకాంత్, యూనుస్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌టీపీలో చేరికలు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మామిడి రాంచందర్

వనస్థలిపురం: సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోలేకపోయారని వైఎస్సార్‌టీపీ ఎల్బీనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి మామిడి రాంచందర్ అన్నారు. వనస్థలిపురంలో శనివారం జరిగిన కార్యక్రమంలో వేమారెడ్డి డయాగ్నస్టిక్స్ అధినేత వేమారెడ్డి తదితరులు వైఎస్సార్‌టీపీలో చేరారు. ఈ సందర్భంగా రాంచందర్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ వనస్థలిపురం అధ్యక్షుడు రమావత్ రవి, డి.ఉపేందర్, రాఘవేంద్ర, ఎం.శ్రీనివాస్, వంశీ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి

నాగోలు: ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించడంలో నిర్లక్ష్యం వ్యహిస్తున్న కేంద్ర ప్రభుత్వానికి నిరసనగా ఈ నెల 13 విజయవాడ జాతీయ రహదారి దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ రాగటి సత్యం మాదిగ పిలుపునిచ్చారు. శనివారం కొత్తపేటలో పలువురు మాట్లాడారు. మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎంఎస్‌ఎఫ్ జాతీయ అధ్యక్షుడు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ, మహాజన సోషలిస్ట్ పార్టీ నాయకుడు రాజు మాదిగ, తోకల చిరంజీవి మాదిగ, రఘు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు దూరముంటే.. కేన్సర్‌కు చెక్

- చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి

చాదర్‌ఘాట్: మద్యపానం, ధూమపానం వంటికి దూరంగా ఉంటే కేన్సర్ దరి చేరదని చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం వరల్డ్ కేన్సర్ డే పురస్కరించుకొని మలక్‌పేట కేర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఎంజీబీఎస్ వద్ద నిర్వహించిన కేన్సర్ అవేర్‌నెస్ వాక్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీరోజూ వ్యాయామం చేయడం అందరూ తప్పనిసరిగా అలవాటుగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ నవీన్‌చంద్, సర్జికల్ ఆంకాలజిస్ట్ డాక్టర్ అవినాష్ చైతన్య, డాక్టర్ మహ్మద్ హసీం, మార్కెటింగ్ హెడ్ కె.ప్రవీణ్‌కుమార్, డిప్యూటీ మేనేజర్ మహ్మద్ అష్రాఫ్ పాల్గొన్నారు.

నేడు వసంత రాజీయం పద్యనాటక ప్రదర్శన

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ చిత్రాలేవుట్ కాలనీ సంక్షేమ సంఘం హాల్లో ఆదివారం (నేడు) సాయంత్రం వసంత రాజీయం (లకుమాదేవి) చరిత్రాత్మక పద్యనాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు శ్రీ మురళీకృష్ణ సాంస్కృతిక కళా సంఘం అధ్యక్షులు సోమ అంజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతపల్లి క్రిష్ణయ్య తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఆర్ఆర్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రరావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, చలనచిత్రాభివృద్ధి సంస్థ వారి సౌజన్యంతో వసంత రాజీయం నాటక ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎస్వీ భారతీ, కె.వి రమణాచారి, ఎమ్మెల్సీ, ప్రముఖ వాగ్గేయ కారుడు గోరేటి వెంకన్న, పేరాల చంద్రశేఖర్‌రావు హాజరవుతారన్నారు.

స్వచ్ఛ్‌భారత్ ఎల్‌బీనగర్ కన్వీనర్‌గా కృష్ణారెడ్డి



నియామక పత్రాన్ని అందజేస్తున్న సామ రంగారెడ్డి

మన్సూరాబాద్: బీజేపీ స్వచ్ఛ్ భారత్ ఎల్‌బీనగర్ కన్వీనర్‌గా మన్సూరాబాద్ సహారా స్టేట్స్ కాలనీకి చెందిన గంగదాసు కృష్ణారెడ్డిని నియమించారు. ఈ మేరకు బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి నియాకపత్రాన్ని జారీ చేసి శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ స్ఫూర్తితో నియోజకవర్గాన్ని స్వచ్ఛ్ ఎల్‌బీనగర్‌గా మార్చేందుకు కృషిచేస్తానని తెలిపారు. బీజేపీ మన్సూరాబాద్ అధ్యక్షుడు నాంపల్లి రామేశ్వర్, లింగోజిగూడ అధ్యక్షుడు కృష్ణంరాజు, వెంకట్‌రెడ్డి ఉన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం



సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి

చైతన్యపురి: డివిజన్‌లోని శ్రీనగర్‌కాలనీలో శనివారం కార్పొరేటర్ బద్దం ప్రేమ్‌మహేశ్వర్‌రెడ్డి పర్యటించి కాలనీవాసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దశలవారిగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు చేపట్టి సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తానన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. డివిజన్‌లోని అన్ని కాలనీల్లో మౌలిక వసతుల కల్పిస్తామన్నారు. జీహెచ్‌ఎంసీ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

త్వరలోనే సమస్యకు పరిష్కారం

మన్సూరాబాద్: కాలనీలోని పార్కును జీహెచ్‌ఎంసీ నిర్వహించే విధంగా చర్యలు చేపడతానని హయత్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ మారుతి దివాకర్ అన్నారు. మన్సూరాబాద్ డివిజన్ జడ్జెస్‌కాలనీలోని పార్కును శనివారం ఆయన పరిశీలించారు. డీసీ మాట్లాడుతూ కాలనీలో పారిశుధ్య కార్మికులు శానిటేషన్ సక్రమంగా చేయడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారని, సర్కిల్ ఏఎంహెచ్ఓతో సంప్రదించి సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చంద్రారెడ్డి, కాలనీవాసులు నాగరాజు, రజనాల చంద్రకాంత్‌రెడ్డి, జనార్దన్, షాబుద్దీన్, వెంకట్‌రెడ్డి, బాల్‌రాజ్ ఉన్నారు.

నిరుపేద యువతుల పెళ్లిళ్లకు సాయం



యువతులకు పుస్తె, మెట్టెలు అందజేస్తున్న ఉప్పల శ్రీనివాస్‌గుప్తా

నాగోలు: 23 ఏళ్లుగా ఉప్పల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబాలకు చెందిన యువతుల పెళ్లిళ్లకు పుస్తెలు, మెట్టెలు, చీరె, గాజులను అందజేస్తున్నామని ఉప్పల ఫౌండేషన్ చైర్మన్, రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా అన్నారు. నిరుపేద కుటుంబాలకు చెందిన ముగ్గురు యువతుల పెళ్లిళ్లకు మంగళసూత్రం, మెట్టెలు, చీరె, గాజులను శనివారం అందజేశారు. నాయకులు ఎస్‌కే మహమ్మద్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరే కృష్ణ భూపతి

రంగారెడ్డిజిల్లాకోర్టులు: జాతీయ లోక్‌అదాలత్‌ను పురస్కరించుకుని ఈ నెల 11వ తేదీన నిర్వహించే లోక్‌అదాలత్‌ను విజయవంతంగా నిర్వహించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి హరే కృష్ణ భూపతి శనివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత సంవత్సరం నిర్వహించిన నాలుగు జాతీయ లోక్‌అదాలత్‌లలో రంగారెడ్డి జిల్లాకు చెందిన 4,64,000 పైచిలుకు కేసులు రాజీతో పరిష్కరించామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం ఫిబ్రవరి 11న కోర్టు ఆవరణలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ నిర్వహించే మొదటి జాతీయ లోక్‌అదాలత్‌ను పురస్కరించుకుని వివిధ అనుబంధ సంస్థలతో పలు దఫాలు చర్చలు జరిపుతున్నామని, కేసులను సులభంగా పరిష్కరించేందుకు పలువురు విశ్రాంతి న్యాయమూర్తులు, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ న్యాయవాదులతో కూడిన ఇరవై ప్రత్యేక లోక్‌అదాలత్ ధర్మాసనాలను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం సమావేశంలో మాట్లాడిన మెట్రోపాలిటన్ సెషన్స్ న్యాయమూర్తి ఆర్.తిరుపతి కేసుల త్వరితగత పరిష్కారానికి రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని అభిప్రాయపడ్డారు. హయత్‌నగర్ మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్ కోర్టు ప్రాంగణంలో నిర్వహించిన ముందస్తు లోక్‌అదాలత్‌లో 227 కేసులు పరిష్కారమైనట్లు హయత్‌నగర్ కోర్టు మెజిస్ట్రేట్ చందన తెలిపారు.